క్లుప్తంగా

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



దీపారాధనలో మహిళలు

తలకొండపల్లి: మండల పరిధిలోని దేవుని పడకల్ శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం ఆలయ చైర్మన్ లట్టుపల్లి రాజ్‌కుమార్‌రెడ్డి స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈఓ స్నేహలత, క్లర్క్ ఆంజనేయులు, ఆలయ చైర్మన్ రాజ్‌కుమార్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీశైలం, మాజీ ఉప సర్పంచ్ తిరుపతి, కృష్ణగౌడ్, రంజిత్‌రెడ్డి, వేద పండితులు పద్మనాభచార్యులు, రామాచారి, శ్రీవాత్సవ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

తలకొండపల్లి: మండల పరిధిలోని అంతారంకు చెందిన జానమ్మ (64) అనారోగ్యానికి గురై మంగళవారం మృతి చెందింది. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి బాధిత కుటంబ సభ్యులను పరామర్శించి రూ.3,000 ఆర్థికసాయం అందజేశారు. అదేవిధంగా వెల్జాల్‌కు చెందిన బాలకిష్టమ్మ (68) ఇటీవల మృతి చెందింది. మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డోకూరి ప్రబాకర్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.6,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో అంజయ్య, మహేశ్, వెంకటయ్య, యాదయ్య, రవి, గణేశ్, శ్రీను, నరేష్, పరంధాములు, అంజి, చెన్నయ్య, నసీ ర్, లక్ష్మణ్, దేవేందర్, రాజు, అజీజ్, విష్ణు, అమీర, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదల పక్షపాతి ధర్మభిక్షం

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీంద్రచారి



ధర్మభిక్షం చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

హయత్‌నగర్: కమ్యూనిస్టు నేత, మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మభిక్షం వర్ధంతిని మంగళవారం సీపీఐ నాయకులు పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని రావినారాయణరెడ్డి కాలనీలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీంద్రచారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యాదిరెడ్డి మాట్లాడుతూ... పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు తన జీవితాన్ని త్యాంగచేసిన ధర్మభిక్షం సేవలు మరువలేనివని, భుపోరాటం ద్వార ఎంతోమంది పేదలకు భూమిని అందించిన నాయకుడు ఆయన అని కొనియాడారు. స్థానిక కౌన్సిలర్ లక్ష్మణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు కేతరాజ నర్సింహ, అరుణ, నవనీత, పుల్లయ్య, దాసరి నారాయణ, నారాయణరెడ్డి, దేవ మ్మ, చందన, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీ చేపట్టాలి

వనస్థలిపురం: గొల్ల, కురుమలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మోసం చేశాడని ప్రజా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్‌కుమార్ యాదవ్ ఒక ప్రకటనలో ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే గొర్రెల పంపిణీ చేస్తానన్న మాటను ఆయన తుంగలో తొక్కారని అన్నారు. గొల్ల, కురుమలు గొర్రెల కోసం అప్పులు చేసి డీడీలు కట్టారని, ఏళ్లు గడుస్తున్నా వారికి గొర్రెలను పంపిణీ చేయకపోవడం దురదృష్టకరమని అన్నారు. తక్షణమే గొర్రెల పంపిణీ చేపట్టాలని, లేనిపక్షంలో డీడీలు కట్టిన లబ్ధిదారులకు వడ్డీతో సహా చెల్లించేలా కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో పార్లమెంట్ ఎన్నికల్లో గొల్ల కురుమలు కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్తారని ఆయన హెచ్చరించారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

తుర్కయంజాల్: పరిసరాల శుభ్రతే ముఖ్యమని మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ రెడ్డి పేర్కొన్నారు. పురపాలక సంఘం పరిధిలోని ప్రతి వార్డులో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం రాగన్నగూడలోని 8వ వార్డులో 35 మంది పారిశుద్ధ్య సిబ్బందితో అరుధంతి కాలనీ, బృందావన్ కాలనీ, వైట్ ఫీల్డ్స్, సరిగమ సిటీతో పాటు ఆయా కాలనీల్లో నెలకొన్న చెత్తా, చెదారాన్ని ఎత్తి శుభ్రంచేయించారన్నారు. రోడ్లకు ఇరువైపులా ఉన్న పొదలను తొలగించి, జేసీబీతో గుంతలు పూడ్చివేయించారు. ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీ కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, నాగేశ్, ఈఈ హరీశ్ పాల్గొన్నారు.

తీరనున్న కష్టాలు

- తుది దశకు కేజీబీవీ భవన నిర్మాణ పనులు
- 2020లో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ చేతుల మీదుగా శంకుస్థాపన
- వచ్చే విద్యాసంవత్సరం నాటికి అందుబాటులోకి
- హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు



పూర్తికావచ్చిన కేజీబీవీ పాఠశాల భవనం

కడ్తాల్: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ నూతన భవనం తుదిదశకు చేరుకుంది. దీంతో తమ సుదీర్ఘ కల నెరవేరబోతోందని విద్యార్థులు సంబురపడుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. సౌకర్యాల లేమితో కొన్ని సంవత్సరాలుగా విద్యార్థులు అనేక ఇబ్బందులు పడ్డారు. మండల కేంద్రంలో 2017–18 విద్యా సంవత్సరంలో అద్దె భవనంలో ప్రారంభమైన కేజీబీవీ పాఠశాల ఇప్పటికీ అందులోనే కొనసాగుతోంది. అయితే అందులో సరైన మౌలిక వసతులు లేక విద్యార్థులు అనేక ఇక్కట్ల మధ్య విద్యనభ్యసిస్తూ వచ్చారు. ఎస్ఎస్‌సీ పరీక్షల్లో ప్రతీఏటా 100 శాతం ఫలితాలు సాధిస్తున్నప్పటికీ ఈ పాఠశాలలో సమస్యలు మాత్రం తీర్చడంలేదు. ప్రస్తుతం పాఠశాలలో 200కు పైగా విద్యార్థినులు, 20 మంది వరకు టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది ఉంటున్నారు. ప్రత్యేకంగా భోజనశాల లేకపోవడంతో వరండాలోనే భోజనాలు చేస్తున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బాత్రూమ్స్ లేవు, ఆట స్థలం లేదు. పాఠశాల సమీపంలో మరుగు నిల్వ ఉండటంతో రోగాలబారిన పడుతున్నారు. తమ కష్టాలు తీరాలంటే అన్ని వసతులతో కూడిన సొంత భవనం కావాలని ఏడేళ్లుగా వారు విన్నవిస్తూ వస్తున్నారు. వారి కష్టాలను గుర్తించిన బీఆర్ఎస్ సర్కార్ 2020 ఏడాదిలో పాఠశాలకు సొంత భవనం నిర్మించేందుకు పూనుకుంది. అయితే భవన నిర్మాణ పనులు అనుకున్నంత వేగంగా జరుగలేదు. గత ఆరు నెలలుగా ఆయా పనులు నిర్విరామంగా సాగడంతో భవన నిర్మాణం చివరి దశకు చేరుకుంది.

రెండెకరాల విస్తీర్ణంలో..

మండల కేంద్రం నుంచి కానుగుబావి తండాకు వెళ్లే రహదారి పక్కన రెండెకరాల విస్తీర్ణంలో విద్యా సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ ఆధ్వర్యంలో రూ.3.35 కోట్ల వ్యయంతో మార్చి12, 2020లో అప్పటి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ కేజీబీవీ పాఠశాల భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. భవన నిర్మాణానికి సకాలంలో నిధులు మంజూరు కాకపోవడం, కోవిడ్, భవన నిర్మాణ కార్మికుల సమస్యతో పాటు ఇతరత్రా సమస్యల కారణంగా కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతూ వచ్చాయి. పలుమార్లు విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానికులు.. ఒత్తిడి తీసుకురావడంతో గుత్తేదారు పనులు చేపట్టడం... తిరిగి కొన్ని రోజులకే పనులు నిలిపివేస్తూ రావడంతో భవన నిర్మాణ పనులు ఆశించిన స్థాయిలో జరుగలేదు.

తుది దశకు పనులు..

ఈ విషయమై స్థానిక ప్రజాప్రతినిధులు జిల్లా అధికారులతో పాటు రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంతో గత ఆరు మాసాలుగా పనులు వేగంగా జరుగుతున్నాయి. వచ్చే 2024–25 సంవత్సరం జూన్ నెలలో తరగతులు ప్రారంభించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు కసరత్తు చేస్తున్నారు. ప్రస్తుతం పెయింటింగ్ పనులు జరుగుతున్నాయి. పాఠశాలకు సంబంధించిన పలు ఫర్నీచర్ కూడ పాఠశాలకు చేరింది. ప్రస్తుతం భవనం అన్నిరకాల సౌకర్యాలు కలిగిఉంది. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం(జూన్)లో పాఠశాలను ప్రారంభించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

అసైన్డ్ భూములిచ్చేది లేదు

- ఎంపీటీసీ లక్ష్మమ్మ

యాచారం: మొండిగౌరెల్లి గ్రామంలో ఉన్న అసైన్డ్ భూములు కంపెనీలకు ఇచ్చేది లేదని.. ఆ భూములు తీసుకుంటే పేద రైతులు జీవనోపాధి కోల్పోతారని చింతపట్ల, మొండిగౌరెల్లి ఎంపీటీసీ సభ్యురాలు తాండ్ర లక్ష్మమ్మ స్పష్టం చేశారు. తాజాగా సర్కార్ మొండిగౌరెల్లి గ్రామంలోని 19, 68, 127 సర్వే నంబర్లల్లో ఉన్న దాదాపు 1,500 ఎకరాలకు పైగా అసైన్డ్, ప్రభుత్వ భూములను కంపెనీలకు తీసుకోవాలని నిర్ణయించి, సమగ్ర సర్వేకు నిర్ణయించింది. వారం కింద ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి మొండిగౌరెల్లిలోని ప్రభుత్వ, అసైన్డ్ భూములను సర్వే చేసి నివేదిక అందజేయాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఎంపీటీసీ సభ్యురాలు తాండ్ర లక్ష్మమ్మ ఆధ్వర్యంలో బీజేపీ బృందం మంగళవారం యాచారం తహసీల్దార్ అయ్యప్పకు వినతి పత్రం అందజేసింది. మొండిగౌరెల్లి గ్రామంలోని అసైన్డ్, ప్రభుత్వ భూములను కంపెనీలకు ఇచ్చేది లేదని తెలిపారు. ఏళ్ల కింద పేద రైతులకు అసైన్డ్ సర్టిఫికెట్లు ఇచ్చినప్పటికీ చాలామంది రైతుల పేర్లు ధరణి పోర్టల్‌లో నమోదు కాకపోవడంతో పట్టాదారు, పాసుపుస్తకాలు అందడం లేదని తెలిపారు. అసైన్డ్ భూములను సర్వేచేసి ముందు రైతుల పేర్లను ధరణి పోర్టల్‌లో నమోదు చేసి పట్టాదారు, పాసుపుస్తకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అధికారుల నిర్వాకం వల్ల పేదరైతులకు కొన్నేళ్లుగా రైతుబంధు, రైతుబీమా, బ్యాంకు రుణాలు అందడం లేదని వాపోయారు. ఈవిషయమై తహసీల్దార్ అయ్యప్ప ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య యాదవ్, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు యాదగిరిరెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు రవీందర్, నాయకులు సందీప్‌రెడ్డి, వెంకటేష్, కుంచారపు రాజవర్ధన్‌రెడ్డి, కట్టెల నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న లక్ష్మమ్మ, నాయకులు

గ్యాస్‌పై అధిక ధరలు వసూలు చేయొద్దు

- పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రఘునందన్



ఇబ్రహీంపట్నం: వినియోగదారుల నుంచి వంట గ్యాస్‌కు అధిక మొత్తం వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మాచన రఘునందన్ హెచ్చరించారు. ఇబ్రహీంపట్నంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. గ్యాస్ వినియోగదారులకు సంతృప్తికరంగా సేవలు అందడంలేదని.. అధిక ధరలు వసూలు చేస్తున్నారని తమకు ఫిర్యాదులు వస్తున్నట్లు తెలిపారు. గ్యాస్ బండల డోర్ డెలివరీ తప్పకుండా చేయాల్సిందేనని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఇటీవల నిర్వహించిన తనిఖీల్లో పలువురు వినియోగదారులు గ్యాస్ డోర్ డెలివరీ సక్రమంగా సాగడంలేదంటూ తమకు ఫిర్యాదు చేశారన్నారు. గ్యాస్ బండను డోర్ డెలివరీ చేయడంతో పాటు అధిక ధర వసూలు చేయకుండా డెలివరీ బాయ్స్‌ను నియంత్రించడం ఆయా గ్యాస్ ఏజెన్సీ డీలర్ల బాధ్యత అని రఘునందన్ తెలిపారు. గ్యాస్ సిలిండర్ల డోర్ డెలివరీలో జాప్యం చేస్తే సహించేది లేదన్నారు. గ్యాస్ ఏజెన్సీల నిర్వహణ సేవా దృక్పథంతోనే ముడిపడి ఉందన్న సంగతిని గుర్తుంచుకోవాలన్నారు. డెలివరీ బాయ్స్ అధిక మొత్తాన్ని వసూలు చేస్తే ఫిర్యాదు చేయాలన్నారు.

బకాయిలు చెల్లించాలి

- యాచారం పీఏసీఎస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి
- మూడో వంతు కూడా వసూలు కాని రుణాలు



సమావేశంలో మాట్లాడుతున్న రాజేందర్‌రెడ్డి

యాచారం: దీర్ఘకాలికం కింద రుణాలు పొందిన రైతులు సకాలంలో బకాయిలు చెల్లిస్తేనే పీఏసీఎస్ మనుగడ సాధిస్తుందని యాచారం పీఏసీఎస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. పీఏసీఎస్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ... గత కొన్నేళ్లుగా మండలంలోని పలు గ్రామాలకు చెందిన 932 మంది రైతులకు గాను రూ.49 కోట్ల దీర్ఘకాలిక రుణాలు ఇచ్చినట్లు తెలిపారు. 2023–24 ఏడాదికి గాను మార్చి 30లోపు రూ.27 కోట్ల బకాయిలు వసూల్ కావాల్సి ఉండగా.. నేటికి కేవలం రూ.7 కోట్ల బకాయిలే వసూలైనట్లు తెలిపారు. మార్చి 30లోపు రైతులందరూ బకాయిలు చెల్లించాలని కోరారు. లేనిపక్షంలో అపరాధ వడ్డీ పెరిగి అప్పు రెండింతలు పెరుగుతుందని తెలిపారు. అప్పు బకాయిలు చెల్లించకపోతే వచ్చే ఏడాది రైతులకు రుణాలు ఇచ్చే అవకాశం ఉండదని.. పీఏసీఎస్ దివాలా తీసే అవకాశం కూడా ఉందని తెలిపారు. యేటా రూ.100 కోట్ల ఆర్థిక లావాదేవీలు జరపడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఇప్పటికి పీఏసీఎస్ తరుపున 1,132 మంది రైతులకు రూ.10 కోట్ల 11 లక్షల పంట రుణాలు, 345 మందికి రూ.5 కోట్ల 40 లక్షలు, మరో రూ.రెండున్నర కోట్లకు పైగా వ్యక్తిగత రుణాలిచ్చినట్లు తెలిపారు. పీఏసీఎస్‌లో రుణాలు పొందిన వారు సకాలంలో వాయిదా బకాయిలు చెల్లిస్తే అవసరమున్న రైతులకు కొత్త రుణాలు ఇచ్చే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

త్వరలో కామన్ సర్వీస్ సెంటర్ ప్రారంభం..

యాచారం పీఏసీఎస్ కొత్త భవనంలో రైతుల ఆర్థిక లావాదేవీలే లక్ష్యంగా కామన్ సర్వీస్ సెంటర్‌ను త్వరలో ప్రారంభిస్తామని రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. రూ.58 లక్షల నాబార్డు నిధులతో పీఏసీఎస్‌కు కొత్త భవనాన్ని నిర్మించామని త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. కొత్త భవనంలో రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు, వ్యవసాయ పనిముట్లు, సామగ్రిని అందుబాటులో ఉంచుతామని తెలిపారు. రైతులకు కావాల్సినవననీ పీఏసీఎస్‌లో లభించే విధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. కామన్ సర్వీస్ సెంటర్ ద్వారా రైతులకు బ్యాంకు సమానంగా లావాదేవీలు జరుపుకునే విధంగా అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ యాదయ్యగౌడ్, సంఘం సీఈఓ నాగరాజు, సంఘం డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి

- బీజేపీ సీనియర్ నేత ఆచారి

తలకొండపల్లి: మండల పరిధిలోని చంద్రధనలో మంగళవారం మాజీ ఉప సర్పంచ్ సుధాకర్ ఆధ్వర్యంలో బహుజన మేధావులు అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఏర్పా టు చేశారు. బీజేపీ సీనియర్ నేత తల్లోజు ఆచారితో పాటు, ఇస్రు రామకృష్ణ, టీచర్లు ముఖ్య అతిథిలుగా హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, శ్రీనివాస్ బహదూర్, కుమార్, సంజీవయ్య సార్, యాదయ్య, ప్రసాద్‌గౌడ్, దాస్‌రామ్ నాయక్, కృష్ణమూర్తి, సుధాకర్, ఎస్.సుధాకర్, మాజీ సర్పంచ్ కుమార్, మాజీ ఉపసర్పంచ్ సుధాకర్, మాజీ జెడ్పీటీసీ నర్సింహ, మాజీ ఎంపీటీసీ యాదయ్య, బీఎస్పీ నాయకులు జంగయ్య, ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి, శేఖర్ యాదవ్, ఎమ్మార్పీఎస్ నాయకులు కృష్ణ, కుమార్, కిరణ్‌పూలే తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో నాయకులు

విద్యార్థినులకు ఆర్థికసాయం

మాడ్గుల: మండల పరిధిలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థిని కాట్ల అంజలి, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని చిక్కుడు మానస ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నారు. తమ పై చదువులకు అండగా ఆర్థిక సహాయన్ని అందజేయలని పాఠశాల ఉపాధ్యాయుడు దేవయ్య.. పూర్వ విద్యార్థులు విష్ణు, ఎస్ఆర్ఐ సూదిని రవీందర్ రెడ్డిని కోరారు. వెంటనే స్పందించిన వారు మానసకు రూ.15వేలు, అంజలికి రూ.15 వేలు, పాలిశెట్టి సురేష్‌కు 8 వేల రూపాయలు అందజేశారు. మంగళవారం ఆ నగదును విద్యార్థినులకు అందజేశారు. ఎన్ఆర్ఐ రవీందర్ రెడ్డి, దేవయ్య, అమర్, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు నగదు అందజేస్తున్న రవీందర్ రెడ్డి

పశువుల రవాణాలో జాగ్రత్తలు కీలకం

- మేలు రకం జాతి కొనుగోలుకు రైతుల ఆసక్తి
- వైద్యులు ధ్రువీకరించిన సర్టిఫికెట్ ఉండాల్సిందే
- ఒక్కోవాహనంలో 6నుంచి 8 పశువుల తరలింపు
- నిబంధనలు పాటించాలి



వాహనంలో తరలిస్తున్న పశువులు



షెడ్‌లో పశువులు

కందుకూరు: అధిక పాల దిగుబడి ఇచ్చే మేలు రకం పశువుల కోసం జిల్లాకు చెందిన రైతులు మహారాష్ట్ర, కర్ణాటక, హర్యానా, పంజాబ్, గుజరాత్ రాష్ట్రాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూర్ వంటి ప్రాంతాలకు వెళ్లి కొనుగోలు చేస్తుంటారు. అక్కడి నుంచి వందల కిలోమీటర్ల మేర తీసుకురావాలంటే సరైన జాగ్రత్తలు పాటించాలని, లేకపోతే నష్టాలు తప్పవని లేమూరు పశువైద్యురాలు డాక్టర్ సంధ్యారాణి పేర్కొంటున్నారు. సుదూర ప్రాంతాల నుంచి తీసుకొచ్చే వాటిని వాహనాల్లో అధిక సంఖ్యలో తరలించడంతో ఇక్కడికి వచ్చే సరికి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంటుందన్నారు. పశువుల కొనుగోలు, రవాణాపై ఆమె పలు సూచనలు, సలహాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

పాటించాల్సిన నియమాలు..

పాడి పశువులను సుదూర ప్రాంతాలనుంచి, ఇతర రాష్ట్రాల నుంచి తెచ్చే సమయంలో విధిగా వెటర్నరీ వైద్యుడితో పాటు పశుపోషణ, పాడి రంగంపై అనుభవం ఉన్న రైతులను వెంట తీసుకెళ్లాలి. ఆరోగ్యవంతంగా, చురుగ్గా ఉన్న పశువులను ఎంపిక చేయాలి. పశువుల శరీర లక్షణాలను గుర్తించి వాటి పాల ఉత్పత్తి సామర్థ్యాన్ని తెలుసుకోగలగాలి. కొనుగోలు ప్రాంతంనుంచి తరలించే సమయంలో శారీరకంగా, మానసికంగా వత్తిడికి గురికాకుండా జాగ్రత్త వహించాలి. వాహనాల్లోని అంచులకు మేకులు, చీలిన రేకులు, బోల్టులు వంటి గాయాలు చేసేవి ఉండకుండా చూసుకోవాలి. లోపలి అంచులకు గడ్డితో నింపిన సంచులను వేసుకోవాలి. పశువుల శరీరం రాపిడికి గురికాకుండా ఉండేందుకు గడ్డి సంచులను ఉపయోగించుకోవాలి. వాహనానికి అడ్డంగా పైన ఏర్పాటు చేసిన కట్టెలు లేదా బొంగులపై పశువుల తల భాగం ఉండేటట్లు కట్టాలి. ఒకే ఎత్తు ఉన్న పశువులను ఒకే వరుసలో కట్టాలి. కాళ్ల కింద మందంగా గడ్డి పరవాలి. దూడలను పశువులు తొక్కే ప్రమాదం ఉంది కాబట్టి ఇతర వాహనాల్లో వాటిని తరలించాలి. పశువులను తరలించే సమయంలో ఒకేసారి మేత, నీరు ఇవ్వకుండా, మధ్య మధ్యలో కొద్ది కొద్దిగా ఇవ్వాలి. వాహనంలో ఎక్కించిన తర్వాత పశువులు సౌకర్యవంతంగా ఉన్నాయా? లేవా? అని గమనించాలి. రవాణా సమయంలో పడుకోనివ్వకూడదు. చూడి పశువుల విషయంలో మరింత జాగ్రత్త అవసరం.

సులభంగా జీర్ణమయ్యే ఆహారాన్ని ఇవ్వాలి..

ఇంటికి చేరాక కొత్త వాతావరణానికి అలవాటు పడే వరకూ ఓర్పు, ప్రేమతో మచ్చిక చేసుకోవాలి. ప్రయాణ బడలిక పోవడానికి విటమిన్లు, ఖనిజ లవణాలను అందించాలి. ఉదయం, సాయంత్రం వేళల్లో గోరు వెచ్చని నీటితో కడగాలి. సులభంగా జీర్ణమయ్యే ఆహారాన్ని అందజేయాలి. వారం పాటు లివర్‌టానిక్ వంద మిల్లీ లీటర్ చొప్పున తాగించాలి. ప్రయాణానికి ముందు తర్వాత శరీర బడలిక మందులు వాడాలి. ఎన్సైడ్స్ ఇన్‌జెక్షన్లు, ఇమ్యూన్ బూస్టర్సు, స్ట్రెస్ రిలీవర్ టానిక్ మందులు ఇవ్వాలి. దీంతో అనారోగ్యం బారిన పడకుండా పశువులను కాపాడుకోవచ్చు. వేసవిలో పశువు రవాణా చేయాల్సి వస్తే రాత్రి వేళలో మాత్రమే ప్రయాణం సాగించాలి. మధ్యాహ్నం తరలించాల్సి వస్తే మధ్య మధ్యలో వాహనాన్ని ఆపుకుంటూ పశువు శరీరంపై నీళ్లు చల్లాలి. సమీప ప్రాంతాల్లో 20 కిలోమీటర్ల లోపు కొనుగోలు చేసిన పశువులైతే వాహనాల్లో కాకుండా నడిపించి తీసుకెళ్లడమే మేలు. మధ్యలో అరగంట నుంచి గంట పాటు విశ్రాంతి ఇవ్వాలి. లేదంటే కాళ్లు మెత్తబడి మేత సరిగా తినక నీరసిస్తాయి.

సర్టిఫికెట్ తప్పనిసరి..

పశువులను రవాణా చేసే సమయంలో ముందుగా అర్హులైన పశువైద్యుడు ధ్రువీకరించిన సర్టిఫికెట్ తప్పని సరిగా తీసుకోవాలి. 1978 పశువుల రవాణా యాక్ట్ ప్రకారం నిర్దేశించిన వాహనాల్లోనే వాటిని తరలించాలి. వాహనాన్ని బట్టి 6 నుంచి 8పశువులను రవాణా చేయాలి. ఒకదానికికొకటి తగలకుండా ఉండేలా రవాణా చేయాలి. చూడి వాటితో ఇతర పశువుల్ని రవాణా చేయొద్దు. నిబంధనలు పాటించకపోతే ఆ వాహనాన్ని ఆర్టీఏతో పాటు పోలీసులు సీజ్ చేసే అవకాశం ఉంటుంది. పెటా యాక్ట్ ప్రకారం కేసులు కూడా నమోదు చేయొచ్చు. పశువులకు మార్గమధ్యలో మేత, నీరు ఏర్పాటు చేయాలి. నిబంధనలు తప్పకుండా పాటించేలా సంబంధిత యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకోవాలి. జాగ్రత్తలు పాటించాలని ఈ సందర్భంగా కోరారు.

కేంద్రంలో అధికారంలోకి వస్తాం

నాగర్ కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లురవి



మల్లురవిని సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

కడ్తాల్: లోక్‌సభ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ మెజార్టీ సీట్లు సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని నాగర్ కర్నూల్ లోక్‌సభ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ మల్లు రవి అన్నారు. మంగళవారం రాత్రి మండల కేంద్రంలో నాగర్ కర్నూల్ లోక్‌సభ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, అచ్చంపేట్ ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ పర్యటించారు. మల్లురవి మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజలందరికీ సంక్షేమ పథకాలు చేరుతున్నాయన్నారు. కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం ప్రజలకిచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు బాల్‌రాజ్, నాయకులు భాస్కర్‌రెడ్డి, కేశవులు, వెంకటేశ్, రాములు, రవీందర్ నాయక్, హీరాసింగ్, చందోజీ, నరేశ్, మల్లయ్య, రమణరెడ్డి తదితరులు ఉన్నారు.